# తాళిబొట్టు

"ఏమండీ! నన్నన్యాయం చేయకండి....అటు చూడండి వాళ్ళ ద్దరి మొహాలైనా చూసి, ఈ ప్రయత్నం మానుకోండి. వాళ్ళను తండ్రి ప్రేమకు దూరంచేయకండి. ఎవర్నెవర్నో వలలో వేసుకున్న అదెవతోగాని, నా సంసారాన్ని నాశనం చేసిన పాపం. అది తప్పక అనుభవిస్తుంది. పెళ్ళయి బిడ్డలున్నారని తెల్సినా, మిమ్మల్ని ప్రేమిస్తోందంటే, అది మీ హృదయాన్ని కాదండి కోరుకొనేది.... మీ కార్లను.... మీ డబ్బును.... మీ హోదాను!.... మీరు కట్టిన తాళిబొట్టుకైనా విలువియ్యండి" కాళ్ళా, వేళ్ళా పడింది సావిత్రి. దీనంగా ఏడ్చింది.

"హుం! ఈ కొండముచ్చుతో ఇన్ని రోజులు కాపురం చేసిందానికే నేను సిగ్గుపడుతున్నాను. ఏ మాయలోపడి నిన్ను ఒప్పుకున్నానోగాని, నిన్ను పెళ్ళిచేసుకున్నాను. అదే నేను జీవితంలో చేసిన పెద్ద పొరపాటు. అందుకు చాల చింతిస్తున్నాను. నా దారికి అడ్డురాకుండా వుంటే కనీసం ఈ ఇంట్లోనైనా నీకు తావు వుంటుంది. లేకపోతే....జరిగేదేమిటో నీకు బాగా తెలుసు!.... నేనూ, రజనీ నాలుగు రోజుల్లో రిజిష్టర్ మేరేజ్ చేసుకోబోతున్నాం". అడ్డొచ్చిన సావిత్రిని, బలంగా నెట్టేసి, విసురుగా కారిడార్‌లోకివచ్చి, కారు 'స్టార్ట్' చేసి, రజని ఇంటికి బయల్దేరాడు సత్యానందరావు. అతని పిల్లలిద్దరూ అమ్మానాన్నలు ఎందుకు పోట్లాడుకుంటున్నారో తెలియక, భయంతో ఓ మూల దాక్కున్నారు.

* * *

కారు శబ్దంవిని, బాల్కనీలోకి వచ్చింది రజని.

"హాయ్! రజనీ! గుడ్ మార్నింగ్" కాన్వెంటు విష్ చేశాడు. చకచక మెట్లెక్కాడు.

"ప్రొద్దున్నే సతీసావిత్రి కొంగులోంచి, సత్యవంతుడు ఎలా బయటపడగలిగాడో" కుర్చీ చూపిస్తూ, నవ్వుతూ అడిగింది.

మల్లేశ్వరి

"నీకోసం కొంగునుంచి బయట పట్టమేకాదు శాశ్వతంగా బంధాలే త్రెంచు కొంటా! నీ అందం....నీ వయ్యారం.... నీ వెన్నెల నవ్వు....మురిపాల ముద్దు పలుకులూ చాలు నా జీవితానికి. నేనూ, నా ఆస్తి - అంతస్తూ అంతా నీదే. నీ సౌందర్యం మాత్రం నాది" అంటూ కౌగలించుకోబోయాడు.

"ఆఁ....ఆఁ....ఆగాలి.... ఆగాలి.... పెళ్ళయేంతవరకూ ఆగాలి" వారిస్తూ దూరంగా జరిగింది.

"నీ కోసం ఏం చేయ మంటావ్ చెప్పు. సముద్రాలు దాటమంటావా! ఆకాశానికి నిచ్చెన వేయమంటావా! ఈ మేడ మీదినుంచి గెంతమంటావా!.... చెప్పు! నేనిక ఆగలేను"

"డైలాగులు చెప్పక్కర్లేదు కాని.... ఓ చిన్న పని చేస్తే చాలు."

"అదేమిటో త్వరగా చెప్పరాదు."

"నీ భార్య మెడలోని తాళి త్రెంచి తీసుకురావాలి. దాన్ని నామెళ్ళో కట్టాలి. అప్పుడే నిన్ను నమ్ముతాను." షరతు విధించింది.

ఒకసారి వినరాని మాట విన్నట్టయి, తేరుకుని— అన్నాడు "ఓహ ! అంతే గదా! రేపే నీవు చెప్పిన పని చేసి నా దాన్ని చేసుకుంటాను"

* * *

"వద్దంటే. త్రెంచకండి.... ఇది పవిత్రమైన మంగళసూత్రం....ఇంత పాపానికి వడి కట్టకండి." గిల, గిల తన్నుకుంది సావిత్రి. కానీ ఫలం లేకపోయింది. రాక్షసత్వం, మూర్ఖత్వం నిండిన రక్తం ప్రవహించేటప్పుడు, సత్యానందరావుకు ఆ మాటలు రుచించలేదు. చెవి కెక్కలేదు.

తెగిన తాళిబొట్టు,చేతికి రాగా, విజయ గర్వంతో రజనీ ఇంటికి బయల్దేరాడు.

* * *

కారు ఆపి, బాల్కనీలోకి దృష్టి సారించాడు. రోజూ తన కారు రాగానే, దర్శనమిచ్చే రజని కన్పించలేదు. మెట్లెక్కి మేడపైకి చేరుకున్నాడు.

కిటికీలోంచి, హాలులో కన్పడు తున్న దృశ్యాన్ని చూసి, నిశ్చేష్టుడయ్యాడు. అతని చేతిలో వ్రేలాడుతున్న తాళిబొట్టు అతన్ని వెక్కిరించింది. పళ్ళు నూరాడు. కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి. పిడికిలి బిగుసుకు పోయింది. ఉచ్ఛ్వాస, నిశ్వాసాలతో అతని ఎద ఎగిరెగిరి పడుతోంది. తన కళ్ళను తనే నమ్మలేక పోయాడు. ఆదృశ్యాన్నిమళ్ళీ చూశాడు. 'తన రజని.... తన బంగారు.... తన దనుకున్న అపురూప సౌందర్యవతి.... మరొకరి కౌగిల్లో.... తన్మయత్వంతో కరిగిపోతూంది.... ఇది కలకాదు. కళ్ళెదుట జరుగుతున్న నిజం!' తల తిరిగి పోయింది సత్యానందరావుకు.

పిచ్చి పట్టినట్టు తలుపు దబ, దబ బాదాడు. రజని, ఆమె కౌగిల్లో వున్న యువకుడు, ఉలిక్కిపడి దూరంగా జరిగారు.

రజని నిర్లక్ష్యంగా సత్యానందరావుని చూసింది. కాని భయపడలేదు. లేవ లేదు. లేచి తలుపు తీయనూలేదు. వయ్యారంగా తన పక్కనే వున్న యువకునిపై చేయి వేసి, సత్యానందరావు వైపు చూసింది.

బోన్లోని సింహంలా కోపంగా చూస్తున్నాడతడు.

"రజనీ, తలుపు తెరు! కులటా! నా ముందే మరొకర్తో కులుకుతున్నావా! ఛీ.... ఛీ! నువ్వా ఆడదానివేనా? నీ కోసం సర్వం త్యాగం చేసి, తుదకు భార్య మెడలో తాళికూడా త్రెంచుకొస్తే, నువ్వు చేసే పని ఇదా!.... నన్ను మోసం చేస్తావా!" గర్జించాడు.

రజని గల, గల నవ్వింది.

"తలుపు తీయాలా! ఎందుకు? నాకు, నీకు ఏమిటి సంబంధం? ఇన్ని రోజులు చనువుగా ప్రవర్తించినందుకా! ఓహ్! అంత మాత్రంచేత నిన్ను నేను ప్రేమించాననుకొంటే పొరపాటు.

నీకు ఈ ఉద్యోగం వేయిస్తున్నా'నని ఉద్యోగం వేయించావ్. అందుకు కృతజ్ఞురాల్ని. నీవు వివాహితుడని తెల్సినా, నీకు బిడ్డలున్నారని తెల్సి, నీవు చొరవ తీసుకుంటున్నా, ఎప్పటికప్పుడు వారిస్తూ నా శీలాన్ని కాపాడుకున్నాను. నీతో ఇన్ని రోజులు చనువుగా వున్నది, నిన్ను ప్రేమించి కాదు. నా ఉద్యోగం నిలుపుకోడానికి. పర్మనెంటయేంతవరకు అలా నటించాల్సి వచ్చింది. నిన్ననే నాకు పర్మనెంటు ఆర్డర్సు వచ్చాయి. ఇక పర్వాలేదు. నీ ఆసరాతో పనిలేదు.... నేను తాళిబొట్టు తెమ్మంటే దారుణంగా అన్నంత పనీ చేశావ్! నీవు ఎంత మూర్ఖుడివో దీన్నిబట్టే తెలుస్తూంది. కేవలం నా అందం కోరి అలా ప్రవర్తించావ్! రేపు మరొకరు నాకన్నా అందంగా కన్పిస్తే దాని వెంటపడ్తావ్! అంత చంచల చిత్తుణ్ణి, వివాహితుణ్ణి పెళ్ళి చేసుకోవడానికి నేనేం అమాయకురాల్ని కాదు....అదిగాక సాటి స్త్రీ సంసారంలో చిచ్చుపెట్టే ధైర్యం నాకు లేదు. ఆ పాపాన్ని నేను భరించలేను.... నేను నిన్ను మోసం చేశానా? కులటనా?.... హుఁ! నమ్ముకున్న భార్యను మోసంచేసే నీవు కులట ... తాళి కట్టని నాపై నీకు అధికారం వుంటే. నీవు పెళ్ళాడిన నీ అర్ధాంగికి నీపై ఎంత అధికారం వుండాలి?.... ఇకనైనా బుద్ధి తెచ్చుకుని. భార్యలు బొమ్మలూ కాదు, మార్చడానికి! ... అగ్నిసాక్షిగా, పదిమంది సమక్షంలో, మనసావాచా "నేనే నీవని నీవే నేనని" ప్రమాణం చేసి. కొంగులు ముడేసుకుని, ఏడడుగులు నడచి, మరో శరీరాన్ని తన అర్థ శరీరంగా భావించి. ఎదుటి మనసును తన మనసుతో కట్టుకుని—అందుకు ప్రతిగా కట్టేదే మంగళ సూత్రం. ఆ సూత్రానికి వుండే విలువ ఏనాటికి తరగనిది.... చెరగనిది....

బై ది బై .... ఇతను మా బావ,.... గుణశేఖర్ .... సద్గుణవతుడు.... అందగాడు ... నెక్స్ట్ వీక్ మా ఇద్దరికి వివాహం జరుగబోతూంది.... నీ భార్య పిల్లల్తో మా పెళ్ళికిరా! శుభలేఖ పంపుతాను. ....మరి గడపకు ఆ ప్రక్కే పెట్టి మాట్లాడుతున్నందుకు మన్నించు. మరో సారైతే.... మంచి మనసుతో నీవు వచ్చివుంటే, కూర్చోబెట్టి కాఫీ యిచ్చేదాన్ని..... ఇప్పుడలా చేయలేను...." అంటూ కిటికీ మూసి వేసింది.

సిగ్గుతో తల తీసేసినంత పనైంది సత్యానందరావుకు. సావిత్రి, పిల్లలు గుర్తొచ్చారు. సావిత్రి కౌగిల్లో ఒదిగిపోయి, క్షమాపణ చెప్పుకోవాలని వడి, వడిగా మెట్లు దిగాడు.